అన్నదాతల్లో తుఫాన్ గుబులు

- ప్రారంభమైన వరి కోతలు
- పంట చేతికొచ్చిన సమయంలో తుఫాన్ హెచ్చరికలతో రైతన్నల్లో ఆందోళన
- కోతలు చేసిన చోట చేనుకుప్పలు పెడుతున్న రైతులు
- రెండు రోజులు కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారుల సూచన


గుర్ల మండల కేంద్రంలో వరి చేను కుప్పలు పెడుతున్న రైతులు

చీపురుపల్లి: వేల రూపాయలు పెట్టుబడి పెట్టి, ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట చేతికందే సమయం వచ్చింది. కొంతమంది రైతులు వరి కోతలు ప్రారంభించగా మరికొంతమంది వరి కోతలకు సన్నద్ధమవుతున్నారు. వరి నాట్లు వేసిన నాటి నుంచి ఇంతవరకు ఎలాంటి తుఫాన్‌లు లేకపోయినా, పంట చేతికందిన సమయంలో తుఫాన్ హెచ్చరికలు అన్నదాతల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన సంగతి తెలిసిందే. రెండు రోజుల నుంచి ఆకాశం మబ్బులు పట్టి, చల్లని గాలులతో వాతావరణం చల్ల బడింది. ఏ సమయంలోనైనా వర్షం కురవొచ్చుననే సంకేతాలు కనిపిస్తున్నాయి. చీపురుపల్లి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ముందుగా నాట్లు వేసిన చోట ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. వరి చేనును పొలాల్లో ఆరబెట్టడం, కుప్పలు వేయడం వంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ సమయంలో తుఫాన్ హెచ్చరికలు రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నా యి. కోతలు చేయాలా వద్దా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ఇప్పటికే కోతలు చేసిన రైతులు పంట ఏమవుతుం దోనన్న ఆందోళనలో ఉన్నారు. ఈ సమయంలో వర్షం కురిసి చేను తడిసిపోతే ధాన్యం రంగు మారిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ధాన్యం రంగు మారితే ప్రభుత్వమే కాకుండా ప్రైవేటు వ్యాపారులు సైతం పంటను కొనుగోలు చేసే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు.

34,157 ఎకరాల్లో వరి సాగు

చీపురుపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 34,157 వేల ఎకరాల్లో వరి సాగులో ఉంది. చీపురుపల్లి మండలంలో 6,600 ఎకరాలు, గరివిడి మండలంలో 7,800, గుర్ల మండలంలో 9,872, మెరకముడిదాం మండలంలో 9,885 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకు తుఫాన్‌లు లేకపోవడంతో పంట కు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. దీంతో కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఆశిస్తున్న తరుణంలో తుఫాన్ హెచ్చరికలు రైతుల్లో గుబులు పుట్టిస్తున్నాయి.


పాతశ్రీరంగరాజపురంలో కుప్పలు వేసేందుకు చేనును కల్లానికి తరలిస్తున్న మహిళలు

కుప్పలు పెట్టే పనిలో బిజీ

గజపతినగరం: మండలంలోని పలు గ్రామాల్లో వరిపంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు చేశారు. దీంతో పాతశ్రీరంగ రాజపురం, కొత్తశ్రీరంగరాజపురం, తదితర గ్రామాల్లో వరి పంట కోతలు చేసిన రైతులు చేనును కుప్పలు పెట్టే పనిలో బిజీబిజీగా ఉన్నారు.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

తుఫాన్‌పై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తమిళనాడు వద్ద తుఫాన్ బుధవారం తీరం దాటనుంది. ఉత్తరాంధ్రకు పెద్దగా వర్ష సూచనలు లేవు. అయినా రైతులు వరి కోతలు రెండు రోజులు వాయిదా వేసుకుంటే మంచిది. ఇప్పటికే కోతలు పూర్తి చేసిన వారు కూడా ఎలాంటి ఆందోళన పడాల్సిన పని లేదు. వర్షం కురిసినా ఒక్కరోజు ఆగి మడిలో నీరు మొత్తం బయటకు పంపిస్తే పంటకు ఎలాంటి నష్టం వాటిల్లదు.

– సీహెచ్.రఘునాథ్, ఏఓ, చీపురుపల్లి


ఎల్.కోట మండలం శ్రీరాంపురంలో పొట్ట దశలో ఉన్న వరి పంట


ఎల్.కోట మండలం రంగరాయపురంలో కోతదశలో ఉన్న పంట


కొత్తవలస మండలం అడ్డూరువానిపాలెంలో వరి చేను కుప్పలు పెడుతున్న రైతులు

వింత పరిస్థితి

లక్కవరపుకోట/కొత్తవలస: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలతో కొంతమంది రైతులు ఆందోళన చెందుతుండగా.. మరికొంతమంది వర్షం కురిస్తే బాగుండును అని ఆశగా ఎదురు చూస్తు న్నారు. కొత్తవలస,లక్కవరపుకోట మండలాల్లోని పలు గ్రామాల్లో బోరుబావులు, సాగునీటి వన రుల ఆధారంగా ముందస్తుగా ఖరీఫ్ వరినాట్లు వేసిన చోట ప్రస్తుతం పంట కోతలు చేస్తున్నారు. వర్షాధారంగా నాట్లు వేసిన చోట పంట ప్రస్తుతం పొట్టదశలోనే ఉంది. ఇంకా రెండు, మూడు నీటి తడులు అవసరమని, ఈ దశలో వర్షం చాలా అవసరమని రైతులు అంటున్నారు. వర్షాలు కురిస్తే కోతదశకు వచ్చిన పంట పాడైపోతుందనే ఆందోళనలో కొందరు రైతులున్నారు.

క్లుప్తంగా

ఓటర్ల నమోదును సమర్థ వంతంగా నిర్వహించాలి


బీఎల్ఓలతో సమావేశమైన ఈఆర్ఓ ప్రమీలా గాంధీ

గజపతినగరం: ఓటర్ల నమోదు ప్రక్రియను బీఎల్ఓలు సమర్థవంతంగా నిర్వహించాలని ఈఆర్ఓ ప్రమీళా గాంధీ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంటింటి సర్వే చేసి, 18 ఏళ్లు నిండిన వారందరితో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించాలని చెప్పారు. ఓటర్ల జాబితాలో తప్పుల సవరణతో పాటు ఏమైనా మార్పులు చేయాల్సి ఉంటే వాటిని చేపట్టాలని ఆదేశించారు. డీటీ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బంది నిరసన


కొట్టాంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

శృంగవరపుకోట/లక్కవరపుకోట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్.కోట మండలంలోని కొట్టాంలో, ఎల్.కోట మండల కేంద్రంలో 104 సిబ్బంది మంగళవారం నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడునెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. 104ను ప్రభుత్వమే నిర్వహించాలని, 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ నంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్ తిరిగి చెల్లించాలని, బీమా సదుపాయం కల్పించాలని కోరారు. 104 ఉద్యోగులు జి.కోటరావు, బి.మహాలక్ష్మి, బి.మాధవి, జి.అప్పలరాజు ఉన్నారు.

సత్తా చాటిన వీరభద్రపురం విద్యార్థులు


కోచ్ రాంబాబు, విద్యార్థులకు ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని అందజేస్తున్న సినీనటుడు సుమన్

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం గ్రామానికి చెందిన విద్యార్థులు ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో సత్తాచాటి ఓవరాల్ ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారని కోచ్ కె.రాంబాబు మంగళవారం తెలిపారు. ఈ నెల 9,10వ తేదీల్లో విశాఖపట్నం జిల్లా మర్రిపాలెం రైల్వే ఇన్‌స్టిట్యూట్ లో నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలల్లో చదువుతున్న వీరభద్రపురం గ్రామానికి చెందిన 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరంతా వివిధ విభాగాల్లో సత్తా చాటి పతకాలు సాధించారు. వీరికి సినీ నటుడు సుమన్ పతకాలతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని అందజేశారు. విద్యార్థులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వరిపంట కోత ప్రయోగం


పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని ఏనుగువలస గ్రామంలో ఏడీఏ ఎస్.కోటేశ్వరరావు, ఏఓ వి.శైలజ పర్యవేక్షణలో వ్యవసాయ సహాయకులు మంగళవారం వరి పంటకోత ప్రయోగం నిర్వహించారు.ఎకరానికి 26 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా కట్టారు. జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు పంటకోత ప్రయోగాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు


ముద్దూరు అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

బొండపల్లి: మండలంలోని ముద్దూరు,కొండవానిపాలెం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎంపీడీఓ జి.గిరిబాల మంగళవారం తనిఖీలు నిర్వహించారు.రికార్డులు, పౌష్టికాహార స్టాక్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆమె మాట్లా డుతూ కేంద్రాలను నిర్ణీత సమయానికి తెరవాలని, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి సత్యవతి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మందుగుండు సామగ్రి సీజ్

గజపతినగరం: మండల కేంద్రంలోని దిగువ వీధిలో అక్రమంగా నిలవ ఉంచిన మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు గజపతినగరం ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. దిగువ వీధికి చెందిన చైతన్య ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచాను తన ఇంటి సమీపంలో నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి సుమారు రూ.40వేల విలువ ఉన్న సామగ్రిని సీజ్ చేసి కేసునమోదు చేసినట్లు చెప్పారు.

బెల్టు షాపుపై కేసు నమోదు

చీపురుపల్లి: నిబంధనలకు విరుద్ధంగా బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్సై ఎల్.దామోదరరావు హెచ్చరించారు. ఈ మేరకు చీపురుపల్లి మండలంలోని దేవరపొదిలాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో భాగంగా గ్రామంలో ఓ బెల్టు షాపును గుర్తించారు. ఈ నేపథ్యంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న గడల నీలంనా యుడు నుంచి 72 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలి పారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి..


వృద్ధుడు అప్పన్న మృతదేహం

బొండపల్లి: మండలకేంద్రం సమీపంలో గల రైల్వే ట్రాక్‌ను దాటుతుండగా పాసింజర్ రైలు ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన అలుగోలు అప్పన్న(62) రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సమాచారం మేరకు విజయనగరం రైల్వే హెచ్‌సీ ఈశ్వర్రావు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని కేంద్రాస్పత్రికి తరలించారు.

కార్తీక ఏకాదశి పూజలు

కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని పట్టణాలు, గ్రామాల్లోని వైష్ణవ, శివాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అభిషేకాలు, హోమాలతో పాటు సామూహిక సత్యన్నారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


శృంగవరపుకోట: ఎస్.కోట వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారికి లక్ష తులసీదళ అర్చన


లక్కవరపుకోట: సంతపేట మల్లికార్జున స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


జామి: పుష్పగిరి వేణుగోపాల స్వామి ఆలయంలో సత్యన్నారాయణ వ్రతం చేస్తున్న భక్తులు


గజపతినగరం: పురిటిపెంటలోని బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ


బొండపల్లి: దేవుపల్లి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ధాన్యం కొనుగోళ్లలో పొరపాట్లకు తావివ్వొద్దు


మాట్లాడుతున్న తహసీల్దార్ అజూరఫీజాన్

మెరకముడిదాం: ఎలాంటి పొరపాట్లు, అక్రమాలకు తావివ్వకుండా మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ అజూరఫీజాన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విధులు నిర్వర్తించనున్న డేటా ఆపరేటర్లు, సాంకేతిక సహాయకులు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటికే రైతులు వరి కోతలు ప్రారంభించారని, మరికొద్దిరోజుల్లో నూర్పులు చేసి ధాన్యం విక్రయానికి సిద్ధం చేస్తారన్నారు.గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని చెప్పారు. ఏఓ శ్రావణితేజ మాట్లాడుతూ ఈ ఏడాది 20 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ఈ–క్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీ పూర్తయిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. డీటీ భాస్కరరావు మాట్లాడుతూ గోనె సంచులు ఉచితంగా ప్రభుత్వమే ఇవ్వనుందన్నారు. ఒకవేళ రైతులు సొంతంగా సంచుల్లో ధాన్యం నింపి, తూకం వేయించడం, రవాణా చేస్తే వాటికి అయ్యే ఖర్చులను రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని స్పష్టం చేశారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై సర్వే


గుర్ల: వల్లాపురంలో ఇంటింట సర్వే చేస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ


గజపతినగరం: మరుపల్లిలో సర్వే చేస్తున్న ఎంపీడీఓ కల్యాణి


దత్తిరాజేరు: వంగరలో సర్వే చేస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలని, పరిశుభ్రత పాటించాలని అధికారులు సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, శానిటేషన్‌పై అధికారులు గ్రామా ల్లో నిర్వహిస్తున్న సర్వే కొనసాగుతోంది. గుర్ల మండలంలోని సొలిపి సోమరాజుపేట, వల్లాపురంలో జెడ్పీ సీఈఓ బి.సత్యనారాయణ, ఎంపీడీఓ శేషుబాబు, వేపాడ మండ లంలోని జాకేరులో ఎంపీడీఓ సూర్యనారాయణ, దత్తిరాజేరు మండల కేంద్రంతో పాటు వంగరలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, గజపతినగరం మండలంలోని మరుపల్లి లో ఎంపీడీఓ బి.కల్యాణి, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉందా, లేదా..? ఉంటే వాడుతున్నారా లేదా, నీరు బయటకు పోయే మార్గం, తాగునీరు అందించే మార్గం, చెత్తసేకరణ తదితర అంశాలపై ప్రజలను ఆరా తీశారు. బహిరంగ మలవిసర్జన చేయకుండా మరుగుదొడ్లను వినియోగించాలని, నివాసపరిసరాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు.

– గుర్ల/వేపాడ/దత్తిరాజేరు/గజపతినగరం

హామీలను అమలు చేసి మాటనిలబెట్టుకోండి

- ఎన్నికల హామీలకు తగ్గట్టుగా బడ్జెట్‌లో కేటాయింపులేవి..?
- హామీలు అమలు చేస్తారని ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలింది
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు, కూటమి నాయకులకు గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, కూటమి నాయకులు సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, కానీ వాటిని అమలు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదనిపిస్తోందన్నారు. అసెంబ్లీలో సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్టే అందుకు నిదర్శనమన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారని గంపెడాశతో ఎదురు చూసిన ప్రజలకు బడ్జె ట్ కేటాయింపులు నిరాశే మిగిల్చాయని అన్నారు. బడ్జెట్ చూసిన తర్వాత కూటమికి ఓట్లేసి మోసపోయామని అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన ఊసే లేకపోగా, నిరుద్యోగభృతికి చిల్లిగవ్వ కూడా కేటాయించలేదని, ఆడబిడ్డ నిధి పథకానికి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి కూడా నిధులు కేటాయించలేదన్నారు. రైతుభరోసా పథకం కింద 53.58 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయంగా రూ.10,700 కోట్లు అందించాల్సి ఉండగా, కేవలం వెయ్యికోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, తల్లికి వందనం పథకాలకూ అరకొరగా నిధులు విదిల్చారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే అయిదేళ్లలోనూ విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల సభల్లో చంద్రబా బు ఊదరగొట్టారని, తీరా అధికారంలోకి వచ్చిన అయిదు నెలల్లోనే విద్యు త్ చార్జీలను పెంచేశారని మండిపడ్డారు. పథకాలు అమలు చేయకుండా, అభివృద్ధి పనులు చేయకుండానే ఈ అయిదు నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.58వేల కోట్లు అప్పు చేసిందన్నారు. వీటిపై సోషల్ మీడియాలో ప్రశ్నించే, నిలదీసే వారిపై కేసులు వేసి భయపెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని, ఇది తగదన్నారు. రాష్ట్రంలో చిన్నారులు, బాలికలు, మహిళలపై అత్యాచారాలు,హత్యలు జరుగుతుంటే కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, లేనిది ఉన్నట్లుగా, ఉన్నది లేనట్లుగా పచ్చమీడియా ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండి పడ్డారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పార్టీ సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు, కరణం ఆదినారాయణ, మధుపాడ సర్పంచ్ కడుపుట్ల పైడిపునాయుడు, నాయకులు పొరిపిరెడ్డి నారాయణమూర్తి, చనుమూరు సత్యారావు, కర్రి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వేపాడ: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈఓ–2 బాలభాస్కరరావు సూచించారు. జాకేరు, బక్కునాయుడుపేట ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలల పరిసరాలు, మరుగుదొడ్లు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరు, వర్క్‌బుక్‌లను పరిశీలించి, వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకులకు సూచించారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరం


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దత్తిరాజేరు: నీటి సంఘం ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాపై చుక్కపేట,దత్తిరాజేరు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చుక్క మురళి, మజ్జి అప్పలనాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో నీటిపారుదల శాఖ జేఈ అందుబాటులో లేకపోవడంతో తహసీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పేర్లను మార్చేసి, టీడీపీ కార్యకర్తల పేర్లు చేర్చి ఎన్నిక నిర్వహించేందుకు అధికారులపై టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ గ్రామా ల్లో ప్రతిపక్షానికి చెందిన రైతులే ఎక్కువగా ఉన్నారని, ఎలాగైనా ఈస్థానాలను గెలవాలని అధికార పార్టీ తప్పుడు పనులు చేయడం సరికాదని అన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా ఎన్నిక నిర్వహించాలని కోరారు.

అభినందన


విద్యార్థినిని అభినందిస్తున్న విజ్ఞాన జ్యోతి కళాశాల అధ్యాపకబృందం

శృంగవరపుకోట: స్థానిక విజ్ఞాన జ్యోతి జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సీహెచ్.కావ్య ఇటీవల సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో తృతీయస్థానంలో నిలిచింది. విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ కె.కోటరావు అధ్యాపకులు కళాశాలలో మంగళవారం అభినందించారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గజపతినగరం : 9010204447 | చీపురుపల్లి : 9010133309 | ఎస్.కోట : 9951602965
Office mail : vzmadvt@gmail.com